
ప్రజాశక్తి
ఆదివారం 9 మార్చి 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





ఘనంగా అపోలో హాస్పిటల్ వార్షికోత్సవం

నెల్లూరు: నెల్లూరులో అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటై పదేళ్లు పూర్తి చేసుకోవడం ఎంతో గర్వకారణంగా ఉందని, ఈ పదేళ్ల ప్రస్థానంలో ఎంతో మంది ఆరోగ్యకరమైన జీవితాలను పొందడం మరింత సంతోషంగా ఉందని అపోలో హాస్పిటల్స్ సిఇఒ నవీన్ వెల్లడించారు. నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వాకథాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. నెల్లూరు అపోలో హాస్పిటల్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, యూనిట్ హెడ్ బాలాజీ ఆధ్వర్యంలో 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 'చికిత్స కంటే నివారణ మేలు' అనే నినాదంతో నగరంలో వాకథాన్ కార్యక్రమం జరిగింది. విఆర్‌సి నుండి తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని అపోలో హాస్పిటల్స్ సిఈఓ నవీన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాకథాన్ రామలింగాపురం మీదుగా చిల్డ్రన్స్ పార్కు వరకు సాగింది. సిఈఓ నవీన్ మాట్లాడుతూ అపోలో హాస్పిటల్స్ నెల్లూరులో ప్రారంభమయ్యి 10 ఏళ్ళు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం అపోలో వైద్యులు నగరంలో గడచిన 10 ఏళ్లలో సాధించిన విజయాలు, పురస్కారాలను వివరించారు.



మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నాం..

- టిడిపిలోనే అభివృద్ధి సాధ్యం
- ఇన్‌ఛార్జ్ మంత్రి ఎన్ఎండి ఫరూక్
- ఘనంగా మహిళాదినోత్సవ వేడుకలు



మహిళలకు చెక్కులు పంపిణీ చేస్తున్న

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మహిళలకు గుర్తింపు ఇచ్చింది. అన్ని రంగాల్లో ముందుకు తీసుకొచ్చింది. టిడిపి ప్రభుత్వమేనని, అప్పుడు ఎన్‌టిఆర్, ఇప్పుడు చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మహ్మద్ ఫరూక్ అన్నారు. శనివారం నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో కలెక్టర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని కళాక్షేత్రం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సెల్ఫీబూత్‌ను ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఐసిడిఎస్, డిఆర్‌డిఎ, మెప్మా, పోలీసు, రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్లను అతిథులు సందర్శించారు. జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నస్యం మహ్మద్ ఫరూక్ మాట్లాడుతూ మహిళా ఆర్థిక పరిపుష్టి సాధించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆకాంక్ష అని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా స్వయంగా ఎదిగేందుకు సంక్షేమ పథకాలతో పాటు సబ్సిడీపై రుణాలు, స్వయం ఉపాధి పథకాలు అందించనున్నట్లు చెప్పారు. ఎంపిలో సర్పంచ్, ఎంపిటిసి, జెడ్‌పిటిసి, ఎంపిపి, జెడ్‌పి చైర్మన్ ఐదింటిలో వ్యవస్థకు నాంది పలికి మహిళలకు పెద్దపీట అవకాశాలు కల్పించేందుకు ఎన్‌టిఆర్ కృషిచేశారన్నారు. మైనార్టీ ఆడబిడ్డల కోసం షాదీ ముబారక్‌ను తాను మంత్రిగా వున్న సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించినట్లు గుర్తుచేశారు. ఎస్‌పి కృష్ణకాంత్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

మహిళలకు స్వశక్తితో జీవించేందుకు మహిళా దినోత్సవం సందర్భంగా డిఆర్‌డిఎ ద్వారా 814 స్వయంసహాయక గ్రూపులకు 133 కోట్లు, 25470మందికి స్త్రీ నిధి రుణాలు రూ.171.07 కోట్లు, వి.ఆర్.ఎఫ్ లోన్లు రూ.50లక్షలు, ఎంఎస్ఎంఇ లోన్లు 35లక్షలు, మెప్మా ద్వారా 184 ఎస్‌హెచ్‌జిలకు 17.08 కోట్లు, రాపిడో బైక్‌లు, జీవనోపాధులు, రిసోర్సుపర్సన్లకు, లబ్దిదారులకు చెక్కులు అందజేశారు. పరిశ్రమల శాఖ ద్వారా పిఎంఈజిపి పథకంకింద రూ.1.02 కోట్లు, చేనేత, జౌళిశాఖ ద్వారా 23మందికి 19.50లక్షల ముద్రారుణాలు, లీడ్‌బ్యాంకు ద్వారా పిఎం విశ్వకర్మ పథకం ద్వారా 41మందికి 41 లక్షలు, నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ కింద ఏడుగురికి 1.80కోట్లు, కిసాన్ క్రెడిట్‌కార్డు పశుసంవర్ధక, మత్స్యశాఖ రైతులు 456మందికి 3కోట్లు, పిఎం సూర్యఘర్ పథకం ద్వారా 104 మందికి 1.95కోట్లు, 5027మందికి ముద్రారుణాల కింద 67కోట్లు, సుకన్య సమృద్ధియోజన కింద 925మందికి పాస్‌బుక్‌లు, అంధులకు ఆర్థిక అనరాస్యత పుస్తకాలు ఐదుగురికి అందజేశారు.

ప్రజా చైతన్య యాత్రలు

ప్రజా సమస్యల పరిష్కారానికి

సిపిఎం ఆధ్వర్యంలో ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజా సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలనే క్రమంలో నేటి నుంచి ఉగాది వరకు సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాచైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. శనివారం నగర నియోజకవర్గ పరిధిలో 53 వ డివిజన్ వెంకటేశ్వరపురం నుంచి ప్రారంభమైన సిపిఎం - ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సిపిఎం ప్రతినిధులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలిసిన సమయంలో చిన్న చిన్న సమస్యలు సైతం పరిష్కారం కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రకు అపూర్వ స్పందన కనిపిస్తుందని, ఎన్నికల సమయంలో కూటమి నాయకులు చేసిన హామీలను విస్మరించిందని, సామాన్య మధ్య తరగతి ప్రజలసమస్యలను ఈ కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వెంకటేశ్వరపురంలో ప్రభుత్వ బ్యాంకు లేక తీవ్ర ఇబ్బందులు స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ ప్రాంతంలో ఎన్నో ఏళ్ల నుంచి ఇళ్లు కట్టుకోని అనేక వకుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, ఆ ఇళ్లకు ప్రభుత్వం తక్షణమే రిజిస్ట్రేషన్ పట్టాలు అందజేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ పెన్నా నదీ పరివాహక ప్రాంతాల్లో కార్పోరేషన్ కొళాయిల్లో మురికి నీరు వస్తుందన్నారు. ఆ నీరు తాగటం వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురౌతు న్నారన్నారు. డ్రైనేజీ, పారిశుధ్య లోపం కారణంగా దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, ప్రభుత్వం ఈ ప్రజాసమస్యల పరిష్కారం కోసం పనిచేయాలన్నారు.ప్రజలుకు అందజేస్తున్న పథకాలను నిలిపివేసేందుకు పి-4 సర్వేలు ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. ఐద్వా నాయకురాలు షేక్ మస్తాన్‌బీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలు విస్మరించి వాడిన కరెంటు బిల్లు కన్నా అదనపు చార్జీల భారం తీవ్రంగా మోపుతున్నారని విమర్శించారు.ఉచిత బస్సు, తల్లికి వందనం, మహాలక్ష్మి పేరుతో ప్రతి పేద మహిళా కు రూ.1500 అంద జేస్తామని ఆర్భాటంగా హామీలు చేశారే తప్ప అమలు చేయడానికి మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు.సిపిఎం నాయకులు జి.నాగేశ్వరరావు, పి.సూర్యనారాయణ, మూలం ప్రసాద్, బి.పి నరసింహ, కత్తి పద్మ, జాఫర్, చెంగయ్య, ఏమేలు, గడ్డం శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.



నగరంలో సాగుతున్న ప్రజా చైతన్య యాత్ర

నేడు జానపద నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి-నెల్లూరు: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులతో 2025 మందితో ఆదివారం మధ్యాహ్నం ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ కోసం జానపద నృత్య ప్రదర్శన ను నిర్వహిస్తున్నట్లు డాన్స్ మాస్టర్ నారాయణమూర్తి తెలిపారు. శనివారం నెల్లూరు జిల్లా జర్నలిస్ట్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకర సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025 మంది తో ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థులతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో చోటు సంపాదించుట కొరకు జానపద నృత్య ప్రదర్శన నిర్వహణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు.గీతాంజలి మాట్లాడుతూ జిల్లా ప్రజలందరూ పాల్గొని చిన్నారుల నృత్య ప్రదర్శన ను తిలకించి మీ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

ప్రజా సమస్యలపై పోరాటం

ప్రజాశక్తి-నెల్లూరు : ఆంధ్రప్రదేశ్ లో ముస్లిం లీగ్ పార్టీ ప్రజల సమస్యలపై పోరాటానికి అవతరించిన పార్టీని నెల్లూరు జిల్లా ముస్లిం లీగ్ పార్టీ అధ్యక్షుడు షేక్ షఫీ అహ్మద్ తెలిపారు. శనివారం నెల్లూరు జిల్లా జర్నలిస్ట్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లిం లీగ్ పార్టీ ముస్లింలకే కాదని, బడుగు బలహీన వర్గాల కోసమని పేర్కొన్నారు.భారత స్వాతంత్రపోరాటంలో ముస్లిం లీగ్ పార్టీ పెద్ద ఎత్తున పాల్గొన్నారని చెప్పారు. కేరళ, పశ్చిమ బెంగాల్ లో గణనీయంగా, ముస్లిం జనాభా ఉన్నారని ముస్లింల తరఫున రాజకీయపార్టీగా ముస్లిం లీగ్ పార్టీ నాయకత్వం వహించినట్లు తెలిపారు. దేశ చరిత్రలో ముస్లిం లీగ్ పార్టీ ఒక చరిత్ర భారత దేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత రాజకీయంలో ముస్లిం లీగ్ పార్టీ పెద్ద భూమిక పోషించినట్లు పేర్కొన్నారు.కొమ్మలపాటి శేషయ్య, పి షబీర్ ఖాన్, జుబేర్, మస్తానయ్య అలీ, అఫ్రోజ్ ఉన్నారు.

నేడు వైసిపి సమావేశం

ప్రజాశక్తి -లింగసముద్రం : లింగసముద్రంలోని స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు కమిటీ సభ్యుల ఎన్నిక జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షులు నోటి వెంకటేశ్వర రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కందుకూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. జెడ్‌పిటిసి ఎంపిపి, వైస్‌ఎంపిపిలు, ఎంపిటిసిలు, గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొనాలని కోరారు.

ఐద్వా జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు : 16వ డివిజన్లోని గుర్రాల మడుగు సంఘంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మహిళా సంఘం నగర నాయకులు కే సంపూర్ణమ్మ. యు టి ఎఫ్ నాయకులు విజయ్ కుమారి పాల్గొని మహిళలకు ఇంటా బయట బడి గుడి రక్షణ లేని పరిస్థితులు మహిళలు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రంలోని తెలుగుదేశం ప్రభుత్వం నూతన మద్యం పాలసీ పేరుతో మద్యం షాపులను గతం కంటే 800 షాపులను పెంచి ప్రభుత్వ ఆధాయానికి ఇదే మార్గం అనడం దారుణమన్నారు. మహిళల మాన ప్రాణాలతో ప్రభుత్వం తమ ఖజానా నింపుకుం టుందని, మద్యం మత్తులో పురుషులు. యువకులు వారి నైతిక విలువలు మరిచి మహిళలపై మైనర్ బాలికలపై దాడులకు సిద్ధపడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో యువత వారి బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు పద్మమ్మ . మస్తానమ్మ. సుగుణమ్మ స్థానిక మహిళలు పాల్గొన్నారు.



ఐద్వా జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

చంద్రబాబు హామీలన్నీ బూటకం : కాకాణి

ప్రజాశక్తి-నెల్లూరు : మహిళలకు ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చిన ఘనత జగనన్నది అయితే, మహిళలను మోసం చేసిన ఘనుడు చంద్రబాబునాయుడని, ఎన్నికల సమయంలో ఆయన చేసిన హామీలన్నీ బూటకమే అని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సర్వేపల్లి నియోజకవర్గం, పొదలకూరు మండలంలో పర్యటించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి నుండి అక్రమాలు, అన్యాయాలు తప్ప, అభివద్ధి జాడే కనిపించడం లేదన్నారు. చంద్రబాబు రాజధాని పేరిట నిధులన్నీ అమరావతికి తరలిస్తూ, పేదలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా దారుణంగా ప్రవర్తిస్తున్నాడన్నారు. చంద్రన్న పేరు చెబితే మహిళలు ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేసి తమ కోరుకున్న గమ్య స్థానానికి తీసుకుని వెళ్లి దిగబెడతామని హామీ ఇచ్చి, నేడు చంద్రన్న పేరు చెబితేనే మహిళలను బస్సులో నుంచి దించేసే పరిస్థితులు దాపరిం చాయన్నారు. జమిలి ఎన్నికలు వస్తే సోమిరెడ్డి చెంచగాళ్లందరికీ, ఇంకాస్త ముందుగానే కనువిప్పు కలుగుతుందన్నారు. అనంతరం వైసిపి నాయ కుడు తుమ్మల ప్రసాద్ తల్లి ఆనందమ్మ పార్థీవదేహానికి నివాళులర్పించారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-నెల్లూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆత్మస్థైర్యాన్ని నింపే క్రమంలో పరీక్షా సామాగ్రి పంపిణీ చేశారు. పరీక్షలకు బాగా సిద్ధం కావాలని..పరీక్షలు బాగా రాయండి" అనే నినాదంతో పనిచేస్తూ ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకల బాలబాలికలందరికి జిల్లాలోని 330 మంది విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని పంపిణీ చేయాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు నిచ్చింది. ఈ క్రమంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని దర్గామిట్ట ప్రాంతంలోని బాలికల గురుకుల సంక్షేమ పాఠశాలలోని 24 మంది బాలికలకు, సర్వేపల్లి గురుకుల పాఠశాలలోని 19 మంది బాలురకు పరీక్షలకు అవసరమైన పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. జిల్లా డిప్యూటీ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర నాయక్, ఆర్థిక శాఖ జాయింట్ డైరెక్టర్ ఏకశిరి వెంకటేశ్వర్లు, దినారీ ప్రభాకర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడారు. అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యాటగిరి సుధాకర్,ఇట్ట వెంకటరత్నం, జిల్లా ఉపాధ్యక్షులు పుల్లయ్య ఉన్నారు.

మహిళా సాధికారిత టిడిపికే సాధ్యం

ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి - జిల్లా వ్యాపితంగా మహిళా దినోత్సవ వేడుకలు




టిడిపి కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎంఎల్‌ఎ ప్రశాంతిరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

డ్వాక్రా సంఘాల ఏర్పాటు ద్వారా ఎపిలో మహిళా సాధికారతకు శ్రీకారం చుట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదేనని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నెల్లూరు నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగు మహిళలు నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి మహిళ సామాజిక, ఆర్థిక పురోగతి సాధించాలనే ఏకైక లక్ష్యంతో చంద్రబాబు నాయుడు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు.కార్యక్రమంలో నెల్లూరు మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, జిల్లా తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి విజయమ్మ. టిడిపి మహిళా విభాగ నాయకురాళ్లు భూదేవి, కప్పిర పార్వతి, వనజారెడ్డి పాల్గొన్నారు.

మహిళలు క్రీడల్లోనూ రాణించాలి

మహిళలు క్రీడల్లో రాణించాలని, క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, మానసిక ఒత్తిడిని నుంచి దూరం కావడానికి సహాయ పడతాయన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నెల్లూరు నగరంలో ఎన్జిఓ హోమ్ లో నిర్వహించిన మహిళా ఉద్యోగుల క్రీడా పోటీల విజేతలకు ఆమె బహుమతి ప్రదానోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమేనని, గెలవాలి అని కషితో ముందుకు సాగడంలోనే నిజమైన విజయం ఉంటుం దన్నారు. మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, జిల్లా ఆరోగ్యశాఖాధికారి వి సుజాత, ఉద్యోగుల సంఘ రాష్ట్ర నాయకులు కర్నాటి వెంకట శివారెడ్డి,రామకష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోరాటాలతో హక్కుల సాధన

ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక 6వ డివిజన్ ప్రాంతంలోని వైవిఎం హైస్కూల్ ఆవరణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకోని మహిళా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీకే డబ్ల్యూ. కాలేజీ లెక్చరర్ భారతీ దేవి పాల్గొని ప్రసంగించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళల పోరటా చరిత్ర అని జర్మనీలో మహిళలు తమ పని గంటల కోసం ఓటు హక్కు కోసం పోరాటం చేశారన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి శివకుమారి. షేక్ మస్తాన్ బి మాట్లాడారు. ఐద్వా నగర అధ్యక్షురాలు ఎన్బి సుబ్బమ్మ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు పేరుతో మహిళల ఓట్లతో గద్దెనెక్కారని 10 నెలలు పూర్తి కావస్తున్న మహిళలకు ఉచిత బస్సు పథకం. మహాలక్ష్మి పేరుతో ప్రతి మహిళకు వారి ఖాతాలో 1500 రూపాయలు జమ చేస్తామన్నారని, తల్లికి వందనం పేరుతో ప్రతి బిడ్డకు 15 వేల రూపా యలు జమ చేస్తామన్నారన్నారు. అవి ఇప్పటికీ అమలు కాలేదన్నారు. అంగన్వాడీ నగర నాయకులు కామాక్షమ్మ మల్లమ్మ స్థానిక మహిళలు పాల్గొన్నారు.

కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో.. స్థానిక దర్గామిట్ట సమీపంలోని కిమ్స్ వైద్యశాలలో శనివారం అంతరా ్జతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వైద్యశాల డిజిఎం టి.వి. శివమాల, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టరు టిజి లక్ష్మీదుర్గ, మైక్రోబ యాలజిస్ట్ డాక్టరు కె.దీప్తి ,న్యూరాలజిస్ట్ డాక్టరు సంఘమిత్ర, రేడియాలజిస్ట్ డాక్టరు నిషిత, గైనకాలజిస్ట్ డాక్టరు జనిత్య, న్యూరాలజిస్ట్ డాక్టరు అభినయరెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ , ఇతర సీనియర్ సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, అడ్మినిస్ట్రేటీవ్ సిబ్బంది, హౌస్ కీపింగ్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. వైద్యశాల డిజిఎం టివి శివమాల మాట్లాడారు. ముందుగా నిర్వహించిన ఇండోర్ గేమ్స్, కల్చరల్ ప్రోగ్రామ్స్, మోనో యాక్షన్ మొదలగు వాటిలో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరి నాయుడు, హాస్పిటల్ ఛీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎస్. సతీష్ కుమార్ , హాస్పిటల్ కో ఆర్డినేటర్ శ్రీధర్ రెడ్డి ఉన్నారు.

నారాయణ మెడికల్ కళాశాలలో

నగరంలోని నారాయణ మెడికల్ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా వైద్యాధికారి డాక్టరు వి. సుజాత విచ్చేసి జ్యోతిప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారం భించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నారాయణ మెడికల్ కళాశాల,హాస్పిటల్ లోని వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్, ఇతర మహిళా సిబ్బందితో కలసి ఈ సంవత్సరం ఈ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. నారాయణ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు పి. శ్రీనివాసుల రెడ్డి మాట్లా డారు. పి. ఇందిర , నారాయణ వైద్య విద్యాసంస్థల కో-ఆర్డినేటర్ డాక్టరు బిజురవీధ్రన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టరు బి. హరిప్రసాద్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు విశ్వకుమార్, ఎ.ఓ సందేష్ రైకర్ ఉన్నారు.

ఎస్‌పి కార్యాలయంలో.. జిల్లా పోలీస్ విభాగం తరపున మహిళా పోలీసు సిబ్బందికి ,మహిళలందరికీ ఎస్‌పి జి.కృష్ణకాంత్ హదయపూర్వక అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షల తెలిపారు. శనివారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అడిషనల్ యస్.పి.(ఏఆర్) మునిరాజ , టౌన్ డిఎస్‌పి సింధు ప్రియ, డి.యస్.పి. రూరల్ గట్టమనేని శ్రీనివాసరావు, ఎస్‌బి డిఎస్‌పి శ్రీనివాసరావు, ఏఆర్ డిఎస్‌పి చంద్రమోహన్, ఉమెన్ పోలీస్ స్టేషన్ సిఐ సుబ్బారావు,ఆర్ఐ వెల్ఫేర్ రాజారావు, ఆర్ఐ అడ్మిన్ హరిబాబు, ఎస్‌బి సిఐ-1 శ్రీ వెంకటేశ్వరరావు, ఎస్‌బి -2 సిఐ శ్రీనివాసరావు ఉన్నారు.



కిమ్స్‌లో..

వలేటివారిపాలెం : మండల సమాఖ్య కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన పొదుపు మహిళలకు ఆటలు, పాటలు పోటీలు నిర్వహిం చి డి ఆర్ డి ఎ ఏరియా కో ఆర్డినేటర్ కె సింహాద్రి రావు చేతుల మీదుగా బహుమతులు అంద జేశారు. సింహాద్రి రావు మాట్లాడుతూ పొదుపు మహిళలు ఆర్థికంగా అభివద్ధి సాదిం చాలన్నారు.సిసిలు తిరుమల,మేరి , కుమారి, అకౌంటెంట్ సోని విఒఎ లు పోల్గొన్నారు

ప్రజాశక్తి - లింగసముద్రం లింగసముద్రం మండల సమాఖ్య కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారంజరిగాయి. స్థానిక వెలుగు కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన పొదుపు మహిళలకు ఆటలు, పాటలు పోటీలు నిర్వహించి ఎపియం కె సింహాద్రి రావు చేతుల మీదుగా బహు మతులు అందజేశారు. ఎపియం సింహాద్రి రావు మాట్లాడారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు మాలతి, సిసిలు, మాధవ,నారాయణమ్మ, మాధవరావు అకౌం టెంట్ అర్చన విఒఎ లు పోల్గొన్నారు

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణ మున్సిపల్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఎంఎల్‌ఎ మాట్లాడుతూ స్త్రీ లేనిదే జననం, గమనం లేదన్నారు. ముందుగా అక్కడ ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి మహిళా మణులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు. మహిళా సమానత్వం కోసం ఆదినుంచి కషి చేస్తుంది టిడిపి పేర్కొన్నారు. పట్టణంలోని 279 స్వయం సహాయక సంఘాల గ్రూపుల సభ్యులకు సంబంధించి 15.2 కోట్ల రూపాయల చెక్కులను కందుకూరు మండలంలోని గ్రామీణ అభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో 45 స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన 5.26 కోట్ల రూపాయల చెక్కులను ఎంఎల్‌ఎ అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో సేవలం దిస్తున్న మహిళలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గారు శాలువాతో సత్కరించి మెమొంటోలను అందజేశారు. మున్సిపల్ కమిషనర్ కే అనూష, సేర్ప్ ఏరియా కోఆర్డినేటర్ సింహాద్రి, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వడ్డెళ్ళ రవిచంద్ర, షేక్ రఫీ, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధుబాబు, ముచ్చు శ్రీనివాసరావు, కల్లూరి శైలజ, పువ్వాడి మౌనిక, మురారి శెట్టి సుధీర్, చుండూరి శ్రీను ఉన్నారు.

వైసిపి కార్యాలయంలో.. పలువురు మహిళా నాయకులను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కందుకూరు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు తుళ్లూరి ఆదిలక్ష్మి, కందుకూరు నియోజకవర్గం అంగన్వాడి విభాగం అధ్యక్షురాలు దేవరకొండ ఆదిలక్ష్మి, పట్టణ మాజీ కౌన్సిలర్ కరిమున్నీసా, వైయస్సార్సీపి నాయకురాలు ధరణి, లక్ష్మి, షేక్ ఆదాంబి ఉన్నారు.

కోర్టు అవరణంలో.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కందుకూరు మండల న్యాయ సేవల అధికార సంస్థ ఆధ్వర్యంలో కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్ ఆవరణంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఒంగోలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి సిహెచ్ వి రామకష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ మహిళలు విద్య, వైజ్ఞానిక రంగాలలో అభివద్ధి చెందినట్లు మహిళలు వివక్షతకు గురికాకుండా సమానత్వం సాధించేందుకు చట్టాలు ఉన్నాయన్నారు. వాటిని ఉపయోగించుకొని సమానత్వాన్ని సాధికారతను సాధించాలన్నారు. లోకదాలత్ సభ్యులు బి వెంకటేశ్వర్లు షేక్ శంషాద్దీన్ న్యాయవాదులు పోకురి కోటయ్య జన్ని కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.



ఐద్వా ఆధ్వర్యంలో (కందుకూరులో)



కందుకూరులోని కోర్టు ఆవరణంలో..

నాగార్జున పబ్లిక్ స్కూల్లో.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కందుకూరు నాగార్జున పబ్లిక్ స్కూల్లో జరిగిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ వి.షాలినీ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయినీలు పద్మావతి, స్టైనీ, సరస్వతి, యం. సౌజన్య, పి రమాదేవి, శ్రీదేవి, సుహాసిని, మాధురి ఉన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో.. పట్టణంలోని సుందరయ్య నగర్‌లో ఐద్వా ,సిఐటియు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సభ జరిగినది. సభకు ఐద్వా పట్టణ కార్యదర్శి ఎస్ కే మల్లికా అధ్యక్షత వహించారు. సిఐటియు నాయకులు ఎస్సే గౌస్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ,మహిళలకు పురుషులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, పని ప్రాంతాల్లో రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పట్టణ కార్యదర్శి ఎస్కే మల్లికా మాట్లాడుతూ రుగుతున్న ధరలను కరెంటు చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. సుందరయ్య నగర్ కాలనీలో ఉన్న కుటుంబాలలో రెండు కుటుంబాల వారు ఎస్కే బేగం ఎస్.కె షాహిదా వారికుటుంబాలను అప్పులు లేకుండా కుటుంబాలను నడుపుతున్నారు వారి ఇరువురిని బి కుమారి ఎస్.కె షఫీ సన్మానం చేశారు. సిఐటియు నాయకులు డి ఎం రాయుడు, ఎస్ కే అస్మా, ఏఎన్ఎం నాగేంద్రం , ఎస్కే షాహిదా సుందరయ్య నగర్ నివాసులు పాల్గొన్నారు.



లింగసముద్రంలో..

కస్తూర్బా విద్యాలయంలో
మంత్రి సవిత ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - వలేటివారిపాలెం : విద్యాలయంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేసి చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. రెండో శనివారం సెలవు దినం కావడంతో కేజీబీవీ లోని విద్యార్థులు కొంత అలసత్వంగా ఉన్నారు. మంత్రి ఉదయం 6:30 గంటలకే విద్యాలయానికి రావడంతో విద్యార్థులు, సిబ్బంది సైతం బిత్తరపోయారు. తెల్లవారేసరికే వలేటివారిపాలెం మండలం జమీన్ ఉప్పలపాడు పరిధిలోని కేజీబీవీకి చేరుకున్న మంత్రి తొలుత విద్యాలయంలోని పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యాలయంలోనికి వెళ్లి తరగతి గదులను చూశారు..

నేడు 105 శంకుస్థాపనలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : నేడు ఒకే రోజు 105 శంకుస్థాపనలు చేస్తున్నామని, ఇది దేశ చరిత్రలోనే తొలిసారి అని ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం నెల్లూరు రూరల్ ఎమ్.ఎల్.ఏ. కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలలకు నియోజ కవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం ఉదయం 6.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నియోజకవర్గంలో శంకుస్దానలు చేస్తున్నా మన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ శ్రీధర్‌రెడ్డి

పొగాకు బ్యారన్లు దగ్ధం

ప్రజాశక్తి వలేటివారిపాలెం

మండలంలోని వలేటివారిపాలెం గ్రామానికి చెందిన వలేటి మాల్యాద్రి వలేటి అంజమ్మ, వలేటి తిరుపతయ్యల పొగాకు బ్యారన్లు దగ్ధమయ్యాయి.సుమారు రూ.8 లక్షల నష్టం వాటిళ్లినట్లు బాధ్యులు తెలిపారు. క్యూరింగ్ సమయంలో పొగాకు కర్రలు జారి గొట్టాలపై పడడంతో మంటలు వ్యాపించి అగ్ని ప్రమాదం జరిగినట్లు బాధితులు తెలిపారు. బోర్డు, ప్రభుత్వం స్పందించి పరిహారం అందజేయాలని బాధితులు కోరుతున్నారు.

'ప్రకాశం'లో వర్క్‌షాప్

ప్రజాశక్తి-కందుకూరు : ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీలో ఎపిఎస్ఎస్‌డిసి ఆధ్వర్యంలో ఆర్డునో ప్రోగ్రామింగ్‌పై ఒక వారం పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ వర్క్ షాప్‌లో బి.టెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ తతీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి ఎపిఎస్ఎస్‌డిసి శిక్షణకర్త యమ్.ఉమా మహేశ్వరరావు నేతత్వం వహించారు. ఈ వర్క్‌షాప్‌లో శిక్షణకర్త విద్యార్థులకు ఆర్డునో ప్రాథమిక పరిజ్ఞానం నుంచి ప్రోటోటైప్ ప్రోగ్రామింగ్ వరకు వివరిస్తూ, ప్రాక్టికల్ ప్రాజెక్ట్‌లను రూపొందించడానికి మార్గదర్శనం ఇచ్చారు. కార్యక్రమంలో ముగింపు రోజున, విద్యార్థులు ఆర్మీ, భద్రత, స్మార్ట్ సిటీ వంటి అవసరాలకు ఉపయుక్తంగా ఉండే ఆర్డునో ప్రోటోటైప్ మోడళ్లను రూపొందించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె. విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాప్‌లు ఇంజినీరింగ్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్. రవి కుమార్, ఈ.సి.ఈ విభాగ అధిపతి డాక్టర్ జి. సురేష్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన పెంచే కార్యక్రమాలను విభాగం తరపున మరింత ప్రోత్సహిస్తామన్నారు. ఈ.సి.ఈ విభాగ ఫ్యాకల్టీ సభ్యులు కే.శ్రీకాంత్,షేక్ మస్తాన్ వలి, ఐ.రామకోటేశ్వరరావు, కిషోర్ కష్ణ పాల్గొన్నారు. వర్క్ షాప్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు.విద్యార్థులు ఈ అవకాశాన్ని కల్పించిన కాలేజీ యాజమాన్యానికి కతజ్ఞతలు తెలియజేశారు.




మాట్లాడుతున్న కంచర్ల విజయ్ శ్రీనివాస్

వైసిపి నుంచి సుకుమార్ రెడ్డి సస్పెన్షన్

ప్రజాశక్తి-కావలి



వైసిపి నాయకులు మన్నెమాల సుకుమార్ రెడ్డిని ఆ పార్టీ అధ్యక్షులు సస్పెండ్ చేశారు. శనివారం పార్టీ అధిష్టానం వివరిస్తూ, పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు పార్టీ అధ్యక్షులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుండి ఆదేశాలు పంపారు. ఈ ఉత్తర్వులు మాజీ ఎం.ఎల్.ఎ. రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి కార్యాలయం మీడియాకు విడుదల చేశారు.



చెక్కు అందజేస్తున్న ఎంఎల్‌ఎ వెంకట క్రిష్ణారెడ్డి

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-కావలి

కావలి టిడిపి కార్యాలయంలో శనివారం ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి సిఎంరిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ మహిళా దినోత్సవం రోజున సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రదాత చంద్రబాబు సహకారంతో అభివృద్ధి సంక్షేమం ఎజెండాగా ముందుకు పోతున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే రూ.2,34,71,463 సి.ఎం.సహాయ నిధిచెక్కులు పంపిణీ చేశామన్నారు. శనివారం 87మంది లబ్ధిదారులకు రూ.93,61,938 సి.ఎం.ఆర్.ఎఫ్. చెక్కులు పంపిణీ చేశామన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబు రోజుకు 18 గంటలు కష్టపడి పనిచేస్తున్నారన్నారు. నమోదు చేసుకున్న నెలరోజుల్లోనే సీఎం సహాయనిధి లబ్ధిదారులకు అందిస్తున్న ఘనత టిడిపి ప్రభుత్వానిదన్నారు. ఆరోగ్యశ్రీ కింద అందుబాటులోకి రాని వైద్య ఖర్చులు సీఎం సహాయనిధి ద్వారా లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు.సిఎం చంద్రబాబు సహకారంతో చెక్కులు పంపిణీలో రాష్ట్రంలో కావలి నియోజకవర్గం మూడోస్థానంలో ఉన్నదన్నారు.



వాటర్ కూలర్ బహూకరణ

ప్రజాశక్తి - ఉదయగిరి

మండల పరిధిలోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల బిజ్జంపల్లి పూర్వ వాస్తవ్యులు మాజీ జిల్లా ఆవాజ్ కమిటీ అధ్యక్షులు ఎస్.ఎం.బాషా వేసవికాలం దృష్ట్యా తాగునీటి బాటలు, వాటర్ డిస్పెన్సర్‌ను పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా శనివారం ఆవాస్ కమిటీ సభ్యులు ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ గత రెండు నెలల ముందు ఓ కార్యక్రమంలో భాగంగా పాఠశాలను ఆయన సందర్శించామన్నారు. ఆ సందర్భంగా ఆయన ఇచ్చిన హామీ మేరకు వారి తల్లిదండ్రులు షేక్ చిన్నమదార్ సాహెబ్ రంతూబీల జ్ఞాపకార్థం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలకు రూ.9వేలు విలువచేసే తాగు నీటి బాటల్, వాటర్ డిస్పెన్సర్‌ను ఎస్ఎంసి కమిటీ సభ్యులు షేక్.నాయబ్ ద్వారా అందజేశారన్నారు. వారికి వారి కుటుంబానికి ప్రధానోపాధ్యాయులు షేక్.నాయబ్ సహోపాధ్యాయులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-మర్రిపాడు

నెల్లూరు - ముంబై జాతీయ రహదారిపై పొంగూరు కండ్రిక వద్ద కారు అదుపు తప్పి ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఢీ కొన్న ఘటనలో నలుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలైన శనివారం చోటుచేసుకుంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ శ్రీనివాసరావు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎంపిడిఒకు మాతృవియోగం

ప్రజాశక్తి-వరికుంటపాడు

వరికుంటపాడు ఎంపిడిఒ గొట్టిపాటి వేణుగోపాల్ రావు తల్లి గొట్టిపాటి పద్మావతమ్మ (84) శనివారం మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతూ నెల్లూరు హరినాథపురంలోని తన నివాసంలో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న వరికుంటపాడు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది వెళ్లి ఆమె మృతదేహానికి నివాళులర్పించారు.



పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-బిట్రగుంట

డాక్టర్ చిగురుపాటి లక్ష్మీనారాయణ సహకారంతో దాతలు శైలజా రాణి, భవినేని అరుణ సహాయ సహకారాలతో జువ్వలదిన్నె సిఆర్‌పాలెం జెడ్‌పి పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రిని శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొద్దుకూరి నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు బాగా పరీక్షలు రాసి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, బలిచాట్ల శ్రీకర్, మర్లపాటి లక్ష్మీప్రసాద్ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంధానిబాషా నియామకం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట



వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, మాజీ ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి బలపరిచిన సయ్యద్ సంధాని భాషాను ఆత్మకూర్ నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులుగా నియమించారు. ఈ సందర్భంగా సంధాని మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఆత్మకూరు నియోజకవర్గం మైనార్టీ అధ్యక్షులుగా నియమించినందుకు గాను జగన్మోహన్ రెడ్డికి, విక్రమ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

పోరాటాలతోనే ప్రజాసమస్యలు పరిష్కారం

పలుచోట్ల ప్రారంభమైన ప్రజా చైతన్య యాత్రల్లో నాయకులు



నెల్లూరు రూరల్‌లో...



కోవూరులో...



కావలిలో..

ప్రజాశక్తి-నెల్లూరు

స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో సౌత్ మోపూర్ గ్రామంలో ప్రజాచైతన్య యాత్రల పర్యటనలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులకు సంబంధించిన పంట కాలవను పరిశీలించి అనంతరం గ్రామస్తులకు అవసరమైన విద్యుత్ లైన్‌మెన్ సమస్యను సౌత్‌మోపూరులోని విద్యుత్ ఎఇని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు, సిపిఎం నెల్లూరు రూరల్ మండల కార్యదర్శి పుడిపర్తి జనార్ధన్ మాట్లాడుతూ మండలంలో అనేక స్థానిక సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయన్నారు. ప్రధానంగా పొట్టేపాలెం, ములుమూడి కలుజులపై హైలెవెల్ వంతెనల ఏర్పాటు, దేవరపాలెంలో రాళ్ళరేవు వద్ద నెల్లూరు కాలవపై శ్మశానానికి వెళ్లేందుకు వంతెన నిర్మించాలని, మొగళ్ళ పాలెంలో క్రికెట్ ఇండోర్ స్టేడియాన్ని వెంటనే అందుబాటులోకి తేవాలని, పర్యటనలు చేసి, వాటిపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొని పోతామని పరిష్కారం కోసం ధర్నాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎంవి రమణ, ఎగ్గోలు.భాస్కర్, గుంటి నాగరాజు, బాలు ఆదిశేషయ్య, పర్చూరు ప్రభాకర్, శ్రీపతి వెంకయ్య, శ్రీపతి దయాకర్ రావు, కె.శ్రీనివాసులు, పేరత్తూరు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు శ్మశాన స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి-కోవూరు : గంగవరం పంచాయతీ రామచంద్రపురం గిరిజన కాలనీలోని స్థానికులకు శ్మశానం స్థలం లేక రోడ్డు పక్కనే పూడ్చుకుటున్నామని గ్రామస్తులు తెలియజేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ప్రజా చైతన్య యాత్ర సందర్భంగా యాత్ర కమిటీ నాయకులు గండవరపు బుజ్జయ్యకు సమస్యను తెలియజేశారు. ఎన్నోసార్లు అధికారులు దృష్టికి రాజకీయ ప్రతినిధులు దృష్టికి తమ గోడు చెప్పిన పట్టించుకోవడం లేదని వాపోయారు. గ్రామంలో అనేకమంది చనిపోతుంటే వారిని గౌరవప్రదంగా ఖననం చేయడానికి శ్మశానం లేదని రోడ్డు పక్కనే ఖననం చేయాల్సిన పరిస్థితి వస్తుందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, అరెకరా భూమిని కేటాయించి శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ అధికారులను కోరారు. సిపిఎం ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకుని పోతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గండవరపు శేషయ్య, సురేష్, మోహన్, హరి, రమణయ్య, గ్రామస్తులు సంజీవయ్య, సునీల్, లక్ష్మయ్య, సుబ్బమ్మ, పద్మమ్మ, రమేష్, పెంచలమ్మ, కోటయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సమస్యలు పరిష్కరించాలని ఆ దిశగా కావలి, జలదంకి, బోగోలు మండలాల్లో శనివారం ప్రజా చైతన్య యాత్రలను నిర్వహిస్తున్నట్లు సిపిఎం నాయకులు తెలిపారు. మొదటగా కావలి మండలం బైనోడిపాలెం, కట్టకిందపాలెం, ఆనేమడుగు, చెన్నాయపాలెం, పెద్ద పట్టపుపాలెం, చెన్నాయపాలెం, గుమ్మడి బొందల, జలదంకి మండలంలోని జమ్మలపాలెం, జలదంకి, బి కే అగ్రహారం, బ్రాహ్మణక్రాక, కమ్మవారిపాలెం, పాత బిట్రగుంట, గౌరవరం, గ్రామాలలో ప్రచారం చేపట్టామన్నారు. ఈ సందర్భంగా బిపిసిఎల్ కంపెనీ, సోలార్ కంపెనీ ప్రాజెక్టుల వల్ల రైతులకు భూ నిర్వాసితులు కాకుండా రక్షణ కల్పించాలని 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రక్షణ కల్పించాలని చైతన్య యాత్ర నిర్వహకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలని స్మార్ట్ మీటర్లు కరెంటు ఛార్జీలు ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలని లక్ష 25వేలకోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై మోపరాదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బోగోలు, జలదంకి మండలంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను త్వరితగతిగా పూర్తిచేసి మంచినీటి ఎద్దడిని నివారించాలని వారు కోరారు. ఈ ప్రజా చైతన్య యాత్రలు ముగింపు సందర్భంగా మార్చి 22 నుంచి 28వ తేదీ వరకు మండలాల వద్ద జరిగే వినతి పత్రాలు ఇచ్చే ధర్నాలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి, కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు కె.జాను, పార్టీ ప్రాంతీయ కమిటీ సభ్యులు అడపాల సురేషు, సిఐటియు మస్తాన్, గుడిపల్లి వెంకట్రావు, ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జీ ఎం.శోభ

4220 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-కావలి

కావలి సబ్ కోర్టు ఆవరణంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 4220 కేసులను పరిష్కరించారు. ఈ లోక్ అదాలత్‌లో ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి ఎం.శోభ అధ్యక్షత వహించి మాట్లాడుతూ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు ఖర్చు కాలయాపన లేని అంతిమ తీర్పును, అలాగే ఇరు పార్టీల వారు సమన్యాయం పొందవచ్చని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ.పి.పి. మృదుల, కావలి న్యాయవాద సంఘ ప్రెసిడెంట్ కె.సురేంద్ర రెడ్డి, వైస్.ప్రెసిడెంట్ సునీల్ బాబు, బెంచ్ మెంబర్లుగా ఎస్.ఎక్స్. కెన్నెడీ, ఐ.సాయి ప్రసాద్‌లను నియమించారు. ఈ లోక్ అదాలత్‌లో న్యాయవాదులు ఎ.ప్రసాద్ రెడ్డి, వేణు గోపాల రెడ్డి, జగన్ మోహన్ రావు, శ్రీదేవి, జయలక్ష్మి, కోమలి, మంజూష, జ్యోతి, రవీనా, కలీం రోజ్దార్, ప్రసన్న కుమార్, రాఘవ రావు, ఇతర జూనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు, లోక్ అదాలత్ మెంబర్ మాలకొండారెడ్డి, పోలీసులు, కోర్టు సిబ్బంది, వివిధ బ్యాంకు వారు, కక్షిదారులు విరివిగా పాల్గొన్నారు. అదేవిధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సీనియర్ సివిల్ జడ్జి ఎం.శోభను మహిళా న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. ఆమెతో పాటు మహిళా న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ కావ్య క్రిష్ణారెడ్డి

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-బిట్రగుంట

భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కావలి ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డి అన్నారు. శనివారం కొండ బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జరుగుతున్న పనులను పరిశీలించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలని ఎలక్ట్రికల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు నిర్దేశించిన ప్రాంతాల్లో మాత్రమే పార్కింగ్ చేసుకోవాలని ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపకుండా పోలీస్‌శాఖ గట్టి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, స్థానిక సీనియర్ నాయకులు రాయి విజయ్ యాదవ్, అన్ని శాఖల అధికారులు భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెరుగుతున్న ఎండ తీవ్రత

వీక్షణం

ప్రజాశక్తి-నెల్లూరు

గడిచిన వారంరోజుల నుంచి ఎండ తీవ్రత పెరుగుతుంది. ఈ కారణంగా ప్రజలు మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. వేసవి కాలం ప్రారంభంలోనే ఎండ తీవ్ర ఎక్కువగా ఉంటే మరి ముందు.. ముందు.. ఎండ తీవ్ర ఏ విధంగా ఉంటుందో, వేడిని తట్టుకొనేందుకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకొనేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ఎండ వేడిని తట్టుకొనేందుకు ఏసీ మిషన్లు, ఎయిర్ కూలర్లు కొనుగోలు చేసేందుకు ప్రజలు షోరూమ్‌లకు క్యూ కడుతున్నారు. జిల్లా రైతాంగం పండించిన పంటను కొనుగోలు చేసేందుకు అవసరమైన మేరకు దాదాపుగా 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామంటూ ప్రకటనలు చేస్తున్నారు. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన గోతాలు, ధాన్యం తేమ కొలిచే యంత్రపరికరాలు అందుబాటులో లేవు. గత ఏడాది ధాన్యానికి మద్దతు ధర రూ.22వేలు ప్రకటించగా ఏడాది టిడిపి ప్రభుత్వ హాయాంలో మాత్రం రూ.17 వేలు ప్రకటించడంతో రైతాంగాన్ని తీవ్ర నిరాశకు గురిచేసింది. ఒకవైపు కరువు కాటకాలతో, వర్షాభావం తోటి పంట దిగుబడి తగ్గిపోగా రెండో వైపు రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లభించక రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం సానుభూతి కూడా చూపించకపోవడం దారుణం. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బడ్జెట్లో వ్యవసాయ రంగానికి అవసరమైన మేర నిధులు కేటాయించకుండా కార్పొరేట్ శక్తులకు రాయితీలు ప్రకటించడంపై పలు విమర్శలకు దారి తీస్తుంది. జిల్లాలో ఉన్న మంత్రులు గ్రామాలను సందర్శించ కుండా రైతులతో మాట్లాడకుండా అసెంబ్లీలో ప్రకటనలు చేస్తే వ్యవసాయంలో నెలకొన్న సంక్షోభాన్ని నిలువరించడం సాధ్యం కాదు. కార్పొరేట్ కంపెనీలకు వరాలు కురిపించిన ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనం ఎందుకు అమలు చేయడం లేదన్నారు. పార్టీ నాయకులకు లాభం చేకూర్చాలన్న ఆలోచనతో ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగిస్తామని ప్రభుత్వం చెప్పడం దుర్మార్గమన్నారు. ఇటీవల కలెక్టర్ సమావేశం నిర్వహించి ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరను రైతులకు చెల్లించాల్సిందేనని, అంతకంటే తక్కువకు కొనుగోలు చేస్తే ఆయా దళారులు, వ్యాపారులపై తీవ్ర చర్యలు తీసుకుంటామని, మిల్లర్లపై కేసులు పెట్టే వరకు పరిస్థితిని తీసుకురావద్దని కలెక్టర్ హెచ్చరించినా ఫలితం కనిపించడం లేదు. జిల్లాలోని 105 రైస్ మిల్లుల వద్ద సచివాలయ సిబ్బందిని అందుబాటులో ఉంచుతామని, రాబోయే నాలుగు రోజుల్లో బ్యాంక్ గ్యారెంటీలు చూపించాలని రైస్ మిల్లర్లను ఆదేశించడంతోపాటు. గోనె సంచులను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. బ్యాంక్ గ్యారెంటీలు చూపి వెంటనే కొనుగోళ్లు ప్రారంభించిన వారికి ప్రభుత్వం తరపున సహకారం ఉంటుందని ప్రకటించారు. అంతిమంగా ఆరుగాలం శ్రమించి కష్టించే రైతులు నష్టపోకుండా చూడాల్సిన భాధ్యత అందరిపై ఉందన్నారు. ఇంత జరిగినా రైతులకు ఏమాత్రం ఉపశమనం కలగలేదని రైతు, వ్యవసాయ, కౌలు రైతుసంఘాల నాయకులు వాపోతున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకోని ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రయివేట్ రంగ సంస్థలు జిల్లా వ్యాప్తంగా వేడుకలు ఘనంగా నిర్వహించుకుంటున్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



మర్రిపాడులో..

ప్రజాశక్తి-మర్రిపాడు

స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఐద్వా మండల అధ్యక్షురాలు మూలి ప్రమీల అధ్యక్షతన శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూలి వెంగయ్య పాల్గొని మాట్లాడుతూ స్త్రీ మూర్తి గొప్ప తనాన్ని వివరిస్తూ స్త్రీలు సంకల్ప బలంతో ఏమైనా సాధించగలరన్నారు. అనంతరం మహిళలకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి శ్యామలమ్మ, మండల కార్యదర్శి రహంతుల్లా, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాధమ్మ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు లక్ష్మీ, నందవరం సిపిఎం నాయకులు మహమ్మద్ గౌస్, మహిళలు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ఉదయగిరి : సిఐటియు ఆధ్వర్యంలో యుటిఎఫ్, అంగన్‌వాడీ, ఆవాజ్ కమిటీ పలు ప్రజాసంఘాల స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం ఏరియా కార్యదర్శి కోడే రమణయ్య, పలువురు యూనియన్‌ల నాయకులు మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో పురుషులకు సమానంగా రానిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పలురంగాల్లో విధులు నిర్వహిస్తున్న మహిళలను వారు సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాణి, సువార్తమ్మ, అంజాద్, దుర్గాప్రసాద్, సుబ్బారెడ్డి, ఫణిరాజ్, ఏడుకొండలు, అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు ప్రమీల, ఆవాజ్ కమిటీ నాయకులు నాయబ్ రసూల్, అన్ని సంఘాల నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించి అన్ని రంగాల్లో ముందంజ వేయాలని సిఐ వెంకట్రావు పేర్కొన్నారు. శనివారం సిఐ కార్యాలయంలో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం దుత్తలూరు ఎస్ఐ ఆదిలక్ష్మి, సర్కిల్ పరిధిలోని మహిళ పోలీసులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సిఐ మహిళను ఉద్దేశించి పలు అంశాలపై కొనియాడారు. కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మకూరులో..

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది మార్చి 8న మహిళా దినోత్సవాన్ని నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుంది అలాంటి చారిత్రాత్మక ఉద్యమమే మహిళా దినోత్సవం అని బిఎస్ఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ షకీలా పేర్కొన్నారు. శనివారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్‌బీ, అధ్యక్షురాలు శివకుమారి మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాలలో ఎదగాలన్నారు. కార్యక్రమంలో టీచర్లు మనోరమ్మ, ప్రసన్న, ఐద్వా జిల్లా సెక్రటేరియట్ సభ్యులు గుల్జారి బేగం, జిల్లా కమిటీ సభ్యులు కొండా లక్ష్మమ్మ, ఎస్.పద్మ, బి.పద్మ, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ఆత్మకూరు డిఎస్‌పి వేణుగోపాల్ పేర్కొన్నారు. శనివారం ఆత్మకూరు పోలీస్ డివిజన్ కార్యాలయంలో డిఎస్‌పి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులైన ఆర్‌టిసి డిపో మేనేజర్ కరీమున్నీసా, పట్టణ వైద్యురాలు ఆస్మా, ప్రభుత్వ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపల్ కామేశ్వరి, పట్టణ మహిళా ప్రముఖులు, ఆత్మకూరు సిఐ గంగాధర్, సంగం సిఐ వేమారెడ్డి, ఆత్మకూరు ఎస్ఐలు జిలాని, సాయిప్రసాద్, పోలీస్ స్టేషన్, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళల చేత భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. అనంతరం మహిళ ప్రాముఖ్యత గురించి సభలో పాల్గొన్న అందరూ ప్రసంగించారు. మహిళా పోలీస్ సిబ్బందిని ఘనంగా సత్కరించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.




కావలిలో..

ప్రజాశక్తి-కావలి : ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, జన విజ్ఞాన వేదిక కావలి డివిజన్ ఆధ్వర్యంలో కావలి పట్టణంలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల, కోఆపరేటివ్ కాలనీలో యు.టి.ఎఫ్. కావలి డివిజన్‌లోని కావలి రూరల్, కావలి టౌన్, జలదంకి, బోగోలు, కొండాపురం, కలిగిరి మండలాల ఆధ్వర్యంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యురాలు బి.శ్రీదేవి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ ముఖ్య అతిథిగా పాల్గొని "మహిళలు - ఆర్థిక సామాజిక స్వేచ్ఛ-మహిళా ఉపాధ్యాయులు ఉద్యోగులు- ఉద్యమంలో వారి పాత్ర" అనే అంశం మీద సుదీర్ఘ ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాల విశ్రాంత ప్రధానో పాధ్యాయురాలు చాకలకొండ శారద, యుటిఎఫ్ కావలి టౌన్ గౌరవ అధ్యక్షురాలు కుమారి జి.కళ్యాణి, యు.టి.ఎఫ్ రిటైర్డ్ సీనియర్ మహిళా నాయకురాలు అజయ్ సంపత్ కుమారి, ఇతర రంగాలకు చెందిన మహిళలు హాజరై విజయవంతం చేశారు.

జనసేన కార్యాలయంలో..

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా శనివారం కావలి జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో వీరమహిళ కొప్పోలు లక్ష్మి అధ్యక్షతన కవిత, సాహితీ, హెలన్, మాధురి తదితర వీరమహిళల సమక్షంలో మహిళలు అత్యధిక సంఖ్యలో పార్టీలో చేరారు. వారికి అళహరి సుధాకర్ పార్టీ కండువాలు కప్పి జనసేన పార్టీలోకి ఆహ్వానించారు. తదుపరి ఇన్‌ఛార్జ్ సుధాకర్ వీర మహిళలు, నాయకులు, జనసైనికుల సమక్షంలో కేక్ కట్ చేసి వీర మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. తదుపరి వీర మహిళలను శాలువాలతో సత్కరించి, వారికి చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతీ మహిళకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొని వీరమహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజాశక్తి-కావలి : స్త్రీలు శక్తికి ప్రతిరూపాలని, ఎక్కడ స్త్రీలకు స్వేచ్ఛ, సమానత్వం, గౌరవం లభిస్తుందో ఆ సమాజం అన్నీ రంగాలలో విలసిల్లుతుందని ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ భవనంలో స్వచ్ఛత (పారిశుధ్య మహిళా కార్మికులకు) సారథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం, ఇతర సంస్థలకు చెందిన 200మంది మహిళా పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం కావలి రెడ్‌క్రాస్ నూతన కమిటీ సభ్యులను సభకు పరిచయం చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ, రెడ్‌క్రాస్ అధ్యక్షులు ఎం.వంశీకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అలేఖ్య, బచ్చు వీరాస్వామి, రెడ్‌క్రాస్ బాధ్యులు డాక్టర్ బెజవాడ రవికుమార్, డి.రవిప్రకాష్, కె.హరినారపరెడ్డి, అరికట్ల మధుసూదన్ రావు, డాక్టర్ పి.శ్రీధర్, ఎం.పార్వతి శంకర్, ఇలింద్ర శ్రీవాణి, గొట్టిపాటి మనోరమ, మద్దుల నరసింహారావు, ఎ.రమేష్ రెడ్డి, జెనిగర్ల మనోహర్, ఓరుగంటి వెంకటేశ్వర్లు, బి లక్ష్మానంద, ఎన్.ప్రణీత్, బెజవాడ ప్రసన్నకుమార్, ఎస్‌కె నయీమ్, పి.కొండలరావు, టిడిపి నాయకులుగుత్తికొండ కిషోర్ బాబు, పొట్లూరి శ్రీనివాసులు, కండ్లగుంట మధుబాబు నాయుడు, జ్యోతి బాబురావు, కిరణ్, దేవరకొండ శ్రీనివాసులు, ఆలా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-కావలి : కావలి బృందావనం కళ్యాణ మండపంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గుంటుపల్లి శ్రీదేవి చౌదరి ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా 120 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజ్ చేయబడిన స్త్రీనిధి రూ.60,65,00,000 చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. మహిళలు ఆత్మస్థైర్యంతో అడుగు ముందుకేయాలని ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కావలి పట్టణం రెడ్‌క్రాస్ భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కావలి ఆర్‌డిఒ వంశీకృష్ణ, టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, పట్టణ మహిళా అధ్యక్షురాలు షబానా బేగం, పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, కండ్లగుంట మధుబాబు నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు పొట్లూరి శ్రీనివాసులు, 19వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జ్ ఏగూరి చంద్రశేఖర్, తిరువీధి ప్రసాద్,18వ వార్డ్ టిడిపి ఇన్‌ఛార్జ్ శానం హరి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో కావలిలోని రెండు కాలనీలలో జరిగిన సభలలో ఎల్.శ్యామల మాట్లాడారు. గిరిజన కాలనీలో బి జయమ్మ అధ్యక్షత వహించగా ఎస్.మాధవి, బి.కుమారి తదితరులు పాల్గొన్నారు. బాలకృష్ణారెడ్డి నగర్ సాయిబాబా గుడి దగ్గర పార్వతమ్మ అధ్యక్షతన లక్ష్మీకాంతమ్మ, చెంచమ్మ, అంకమ్మ, రవణమ్మ, విజయ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు. పై సభల్లో స్త్రీ విముక్తి సంఘటన జిల్లా నాయకురాలు ఎల్.శ్యామల పాల్గొని అంతర్జాతీయ మహిళా పోరాట స్ఫూర్తిని వివరించారు. రెండు కాలనీలలో మొత్తం 40 మంది మహిళలు ఈ సభల్లో పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం తుఫాన్ నగర్లోని సంయుక్త నృత్య కళా నిలయంలో సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో కావలి పట్టణంలో అనేక రకాల సేవా కార్యక్రమాలు కొనసాగించడమే కాకుండా కరోనా సమయంలో విజయవాడ వరదల సమయంలో సంయుక్త సేవాసంస్థ ద్వారా అనేక విధాలుగా సహాయ సహకారాలు అందించిన వరల్డ్ ఆర్య,వైశ్య మహాసభ అనుమలశెట్టి కామాక్షి, వాసవి క్లబ్ వనిత లెంజెండ్కావలి దుగ్గిశెట్టి.హేమలత, గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్నెస్ అసోసియేషన్ నియోజకవర్గం ఉమెన్ వింగ్ చైర్‌పర్సన్ బొగ్గరపు.శ్రీలక్ష్మి, అభయం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, ఇలింద్ర.శ్రీవాణి, గ్రీన్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు వేమూరి గాయత్రిలను ఘనంగా సన్మానించారు. ఉచిత కుట్టు శిక్షణ నేర్చుకుంటున్న మహిళలకు మహిళా దినోత్సవం సందర్భంగా ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థసభ్యులు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బుర్లా రఘుకుమార్ రెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పిఐ జాఫర్‌ఖాన్, విశ్రాంత లెక్చరర్ ఎంవిఎస్ ప్రసాద రావు, విశ్రాంత బి సి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ షేక్ ఖాధర్‌బాషా, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం



ప్రజాశక్తి-కొడవలూరు :అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులకు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఎన్‌జిఒ వారు నిర్వహించిన వివిధ రకాల ఆటలు పోటీల్లో పాల్గొని ఏడు బహుమతులను కొడవలూరు లైబ్రరీ కె రాజేశ్వరి కైవసం చేసుకున్నారు. దీనికి సాటి ఉద్యోగులంతా ఆమెను అభినందించారు.



కొనుగోలు కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి-విడవలూరు: మండల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ఆకస్మికంగా తహశీల్దార్ చంద్రశేఖర్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పండించిన బి పి టి 5204 రకం ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు వద్దే అమ్ముకోవచ్చని వ్యవసాయ అధికారులు రైతులకు కావలసిన గోతాములు, ట్రాన్స్‌పోర్టు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల్లోని రైతులు ముందుగా వి ఏ ఏ లకు తెలియజేసి రైతులకు కావలసినవి సమకూర్చడం జరుగుతుందని అన్నారు.కార్యక్రమంలో జిల్లా కో-ఆపరేటివ్ అధికారి జి.గురప్ప, తహశీల్దార్ చంద్రశేఖర్, వ్యవసాయ అధికారి వెంకటకృష్ణయ్య, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొడవలూరు

మండలంలోని తలమంచి, నార్త్ రాజుపాలెం ధాన్యం కొనుగోలు కేంద్రాలను జాయింట్ కలెక్టర్ కార్తీకు శనివారం పరిశీలించారు. రైతులందరూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలని కోరారు. రైతులకు ఈ కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అధికారులు స్పందించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉండాల్సిన సదుపాయాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో కొడవలూరు తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి, మండల వ్యవసాయ అధికారిని సిహెచ్‌ఎస్ లక్ష్మి, రెవెన్యూ సిబ్బంది ,వ్యవసాయ శాఖ సిబ్బంది, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-కోవూరు :పెండింగ్ కేసుల పరిష్కారానికి కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన కాలాన్ని వృథా చేసుకోకుండా లోక్ అదాలత్ ద్వారా అటువంటి కేసులకు పూర్తిస్థాయిలో పరిష్కారం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి పి.చైతన్య అన్నారు. కోవూరులోని కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ లోక్ అదాలత్‌లో పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని సత్వర న్యాయం పొందాలన్నారు. ఈ లోక్ అదాలతో పరిష్కారం అయ్యే కేసులన్నింటికీ పూర్తిస్థాయిలో చట్టభద్రత కూడా ఉంటుందన్నారు పెండింగ్ కేసుల పరిష్కారానికి కోర్టు చుట్టూ తిరుగుతూ కక్షిదారులు విలువైన కాలాన్ని వథా చేసుకోకుండా రాజీకి వీలు పడే కేసులను లోక్ అదాలత్లో సులువుగా పరిష్కరించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి శివనమ్రత, లోక్‌అదాలత్ సభ్యులు వి.రాంబాబు, వంశీప్రియ, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

స్పష్టమైన లక్ష్యంతోనే విద్యార్థులు ముందడుగు వేయాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులు తిరివీధి సుబ్రహ్మణ్యం అన్నారు. బెజవాడ బుజ్జమ్మ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో శనివారం 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. నేటి సాంకేతిక యుగానికి అనుగుణంగా కోర్సులను అభ్యసించాలని, ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులను గమనించాలన్నారు. సబ్జెక్టుపై పట్టు, అందమైన చేతిరాతతో ప్రతి ఒక్కరూ ఉత్తమ మార్కులు సాధించొచ్చని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. సుజాతను లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. పరీక్షా సామగ్రిని అందజేసిన లయన్స్ క్లబ్ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం. సుజాత, సామాజికవేత్త గండికోట సుధీర్ కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు తిరివీధి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి పి. మస్తాన్ బాబు, కోశాధికారి నాగయ్య, పూర్వ అధ్యక్షులు దర్శి బాల నరసింహారావు, సప్తగిరి వెంకటేశ్వర్లు, సభ్యులు రామచంద్రారెడ్డి, సునీల్, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉలవపాడులో

ప్రజాశక్తి -ఉలవపాడు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం ఉలవపాడు లో సరయుస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ హెచ్ సి జి ఎం.ఎస్.ఆర్ కేన్సర్ సెంటర్ ఒంగోలు వారి సంయుక్త ఆధ్వర్యంలోఉచిత గర్భసంచి కేన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గైనకాలజిస్ట్ డాక్టర్ సుస్మిత, కేన్సర్ వైద్య నిపుణులు డాక్టరు ఆళ్ళ. దీప్తి పాల్గొని 40 సంవత్సరాల పైబడిన మహిళలకు గర్భసంచి కేన్సరు పరీక్షలు ఉచితంగా నిర్వహించి తగిన సూచనలు సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టరు సుస్మిత మాట్లాడుతూ 40 సంవత్సరాలు నిండిన మహిళల్లో వచ్చే అసహజమైన శారీరక మార్పు లను ముందుగానే గుర్తించి గైనకాలజిస్ట్ వైద్యులను సంప్రదించి గర్భసంచి కేన్సరును చాలా వరకు నివారించే అవకాశం ఉందని దానికి ఈ పాప్ స్మెయర్ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టరు.రాజేష్ మాట్లాడుతూ మా సర యుస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ద్వారా ప్రతి బుధవారం ఉచిత ఓ.పిలు, ప్రతి ఆదివారం ఉచితంగా సుగర్ పరీక్షలు నిర్వహిస్తారని ఈ అవకాశాన్ని మండల పరిధిలోని పేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ప్రజాశక్తి-ఉలవపాడు: మండల ఆర్యవైశ్య సంఘం వాసవి క్లబ్ ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు ఉన్నత స్థాయి ఎదగాలని పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షురాలు పొన్నూరు పావని, ఉపాధ్యక్షురాలు పేర్ల శ్రీలక్ష్మి కార్యదర్శి ఆకుల. జయశ్రీ, ఆర్యవైశ్య మహిళా విభాగ అధ్యక్షులు బాపనపల్లి లక్ష్మి ప్రసన్న, ఉపాధ్యక్షురాలు తూనుగుంట హేమలత, మండల ఆర్యవైశ్య అధ్యక్షులు బాపనపల్లి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి పొన్నూరు రామాంజనేయులు, ఉప కార్యదర్శి తూనుగుంట దివ్యనంద గుప్త, కమిటీ సభ్యులు వక్కలగడ్డ మణికంఠ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

స్థానిక మండల వెలుగు కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వెలుగు కార్యాలయ ఆవరణంలో మహిళలు వేసిన ముగ్గులు ఆకర్షణగా నిలిచా యి. టిడిపి మండల అధ్యక్షులు సన్నారెడ్డి సురేష్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందు ఉన్నారని. కుటుంబంలో ముఖ్య భూమిక వారిదేనన్నారు. మండల పరిషత్ లో మహిళా ప్రతి నిధులు రాజకీయ ప్రాతినిధ్యం వహించడాన్ని సురేష్ రెడ్డి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి బొమ్మి సురేంద్ర, జెడ్పిటిసి ఎంబేటి శేషమ్మ, మాజీ ఎంపీపీ ఇంగిలాల నిర్మలమ్మ టిడిపి ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాసులు, ఎంపిటీసీ సభ్యులు కొనతం రఘుబాబు, మాగుంట రమణారెడ్డి నెల్లిపూడి సుధాకర్, తమ్మిరెడ్డి వెంకటే శ్వ ర్లు గోపిరెడ్డి వెంకటేశ్వర్లు, మన్నెం కిరణ్, వెలుగు అధికారులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

ప్రజాశక్తి-కోవూరు

వ్యవసాయం సాగు చేసే రైతులు ఈ సీజన్లో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైతు సేవా కేంద్రాలను వారు ఉపయోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లోని రైతు సేవా కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులతో మాట్లాడగా రెండు సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, అందులో ఒకటి రైతులకు అందించే గోతాలు సరిపోవడంలేదని, బ్యాంక్ గారెంటీ కూడా కొన్ని మిల్లులకు పూర్తయిందన్నారు. ఈ రెండింటిని సకాలంలో పరిష్కరించేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ధాన్యం



మాట్లాడుతున్న జెసి

తేమశాతం కూడా రైతులు దృష్టి పెట్టాలన్నారు. రైస్ మిల్లుకు ధాన్యం తోలిన 48 గంటల్లోగా డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా తగు చొరవ తీసుకుంటామన్నారు. ముఖ్యంగా ఈ ధాన్యం విషయంలో షెడ్యూలింగ్ అనేది ప్రధానమని, దీనిపై వ్యవసాయ శాఖ సహాయకులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతి గ్రామంలో వారి వారి పరిధిలో ఉన్న రైతులతో ప్రత్యేకంగా మాట్లాడి కోతకు వచ్చే రెండు రోజులకు ముందే షెడ్యూలింగ్ ఏర్పాటు చేసుకుని వారికి సకాలంలో గోతాలు అందించేలా సొసైటీ చొరవ తీసుకోవాలన్నారు. బ్యాంక్ గ్యారెంటీ పూర్తయిన మిల్లర్లు వెంటనే తిరిగి బ్యాంక్ గ్యారెంటీ చెల్లించేలా జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన పలువురు రైతులతో స్వయంగా మాట్లాడారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డిఎం అర్జున్‌రావు, డిఎస్‌పి అంకయ్య. ఏఎం టెక్నికల్ లక్ష్మీనారాయణ. తహశీల్దార్ నిర్మలానంద బాబా, సొసైటీ సిఇఒ గోవర్ధన్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు మెహరిసా, చైతన్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎను విమర్శించడం సరికాదు

ప్రజాశక్తి-కొడవలూరు

ప్రసన్న కుమార్ రెడ్డి అధికారంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు డబ్బులు తీసుకోకుండా చిన్న గుమస్తా ఉద్యోగం కూడా ఇవ్వలేదని అలాంటి వ్యక్తివి మా ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి గురించి మాట్లాడే హక్కు ఆయనకు లేదన్నారు. మండలంలోని యల్లాయపాలెం పంచాయతీలు శనివారం కోవూరు నియోజకవర్గ టిడిపి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైసీపీ పాలనలో అవినీతికి అక్రమాలకు మాఫియాలకు కేరాఫ్ అడ్రస్ మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి తన అనుచరులు కలిసి కోవూరు నియోజకవర్గాన్ని



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

మార్చేశారన్నారు. వైసిపి వాళ్ళ రైతుల గురించి బాధపడడం ఎంతో బాధాకరంగా ఉందన్నారు. వైసీపీ పాలనలో మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ కుమార్ రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులను దోచుకున్నారన్నారు. ఆ లెక్కలను సోమవారం జరిగే ప్రెస్ మీట్ లో ఎవరెవరు ఎంత తిన్నారో లెక్కలు తేలుస్తామన్నారు. మా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి రైతులకు చేస్తున్న అందిస్తున్న సహాయ సహకారాలు చూస్తూ ఓర్వలేకనే ఇలాంటి వేషాలు వేస్తున్నారని వారు దుయ్యబట్టారు. మా ఎమ్మెల్యే కోవూరులో అవినీతి, వివాదరహిత సమసమాజ కోసం ప్రయత్నిస్తు మమ్మల్ని అదుపు చేస్తుందన్నారు. ఆమె తలుచుకుంటే మీరు ప్రజల్లో జరగలేని పరిస్థితి అన్నారు. మా ఎమ్మెల్యే గురించి విమర్శలు చేస్తూ మాట్లాడితే సహించ చేది లేదన్నారు. కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు, కన్వీనర్లు ఇంతా మల్లికార్జున్ రెడ్డి, జెట్టి. రాజ గోపాల్ రెడ్డి, వీరేందర్ చౌదరి, బత్తల. హరికృష్ణ, మాతూరు శ్రీని వాసరెడ్డి, జొన్న .శివకుమార్, గరికపాటి రాజేంద్ర, వెంకటరమణారెడ్డి, చెక్క .మదన్ కుమార్ పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆనంద్

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-కోవూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 4 వేల మందికి కుట్టు శిక్షణ అందించాలని ఆదేశాలు ఇచ్చిందని, దీనిని మహిళలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఓ. ఆనంద్ ఆకాంక్షించారు. కోవూరు మండలం లేగుంటపాడు గ్రామ సచివాయంలో శనివారం బీసీ కార్పొరేషన్ ద్వారా ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ శిబిరాన్ని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఇటువంటి మంచి అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ వారికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మహిళలతో శిక్షణ ఎన్ని రోజులు వస్తారు. ఎంత సేపు నేర్చుకుంటారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిర్మల, పెన్నా ఆయకట్టు చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి, తహశీల్దార్ నిర్మలానందబాబా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-కోవూరు: కోవూరులోని పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం నిర్వ హిచనున్న ఎస్‌పి కృష్ణకాంత్, పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల కార్యక్రమానికి సంబంధించిన శనివారం ఆ ప్రాంగణంలో ఏర్పాట్లను కోవూరు సిఐ సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో చేపట్టారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా కోవూరు నియోజకవర్గంలోని మూడు ప్రధాన పోలీస్ స్టేషన్లకు మూడు కొత్త వాహనాలను అందజేస్తున్నారు. దీనికి సంబంధించి ఏర్పాటు చేయనున్న కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైనీ డిఎస్‌పి ఏ. శివప్రియ, కోవూరు ఎస్ఐ రంగనాథ్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, జెట్టి మదన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, గాదిరాజు అశోక్‌కుమార్, పి. మధుసూదన్‌రావు, ఆవుల వాను, బీద భాస్కర్‌రావు, తదితరులున్నారు.

తేమ ధాన్యంపై రైతులు ఆందోళన చెందొద్దు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాళెం: రైతులు తాము పండించిన ఏ రకం ధాన్యమైన తేమ శాతం కలిగి ఉంటే ఆందోళన చెందవద్దని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం మండల పరిధిలోని ఇసుక పాలెం మరియు వవ్వేరు గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మద్దతు ధర కింద పుట్టుకు 19720 రూపాయలను అందించటం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి రైతులం దరూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుతున్న మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సురేందర్ రెడ్డి, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.